# అభిమానంలోని అంతర్యం +

రచన:
శ్రీ సోమలింగం.

అది కాళరాత్రి. చీకట్లు నలుదిశలా దట్టంగా కాటుక రాశిలా వ్యాపించాయి. మరు క్షణంలో ప్రశాంతంగా వున్న ఆకాశం అంతా మబ్బులతో నిండిపోయింది. చిన్న జల్లు ప్రారంభమై ఉండుండి కుండపోతగా వర్షం కురియనారంభించింది. ఉరుముల మెరుపులతో ప్రకృతి భయంకరంగా గర్జిస్తోంది. ఏర్లు, వూర్లు ఏకమయ్యేలా వర్షం భోరున కురుస్తోంది. కన్ను పొడుచుకున్నా కానరాని ఆనాటి అమావాస్య చీకటి తన భయం కరకరాళ హస్తాలతో లోకాన్ని మ్రింగివేద్దామాయని చుట్టూ వ్యాపించింది. ఎక్కడో మెరుపు తీగ జిగిల్ మని మెరిసింది. ఆ వెంబడి పిడుగుపడ్డ శబ్ధం వినిపించింది. ఆ గాలివానకు దగ్గరలోవున్న ఒక బ్రహ్మాండమైన వటరాజము తన ఆయుష్షు చెల్లినట్లుగా భూమిపై ఒరిగిపోయింది. ఇలా ప్రకృతి అంతా మహాప్రళయంగా వుంది. ఈ దృశ్యాన్ని మంచం పైనుండి కిటికీద్వారా చూస్తున్న పార్వతమ్మ తనదృష్టిని మెల్లగా మంచం వైపు సారించింది. ఆమంచంపై వున్న రెండేళ్ల పసిపాప చావు బ్రతుకుల్లో వుండి మృత్యువుతో తన శాయశక్తులా పోరాడుతోంది. పాపం...ఆ పిల్లయొక్క తల్లి ఆ పసిపాపను తదేక దీక్షతో చూస్తోంది. ఆ బిడ్డపై గల ప్రేమ, మమకారం ఆమెను వదల్లేక పోతున్నాయ్. ఆమె గత రెండు రోజులనుండి తిండి తినలేదు కాబోలు; చాలా నీరసపడిపోయింది. కళ్ళు లోనికిపోయినాయి. మొహంలో కళలేదు. తన బిడ్డే తన సర్వస్వం, అని నమ్ముకొని, ఆ బిడ్డ బ్రతుకుకోసం అహోరాత్రులు పరితపిస్తూ, ఆ బిడ్డకోసం తనప్రాణాలనైనా లెక్క చెయ్యక ఆ పిల్ల మంచంవద్దే కూర్చుని పరితపిస్తున్న ఆమెయొక్క ఆ బిడ్డపైగల ప్రేమ, మమకారం ఎటువంటిదో విశదమౌతోంది. ప్రస్తుతం బిడ్డ పరిస్థితి చాలా ప్రమాదంగా అవుపిస్తోంది. ఆ పిల్లను మరల చూసింది. అశ్రుధారలు కనులవెంట దారాళంగా కారసాగాయి. హోరుమని వీచే గాలికి కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నాయి. ఆమె నింపాదిగాలేచి వెళ్ళి కిటికీలోంచి బయట వాతావరణాన్ని మరల చూసింది. మధు యింకా తిరిగిరాలేదూ! అనుకుంటూ, మరొకసారి దృష్టిసారించి చూచింది. అల్లంతదూరంలో ఏదో ఆకారం తూలుతూ వస్తోంది. మరల పరీక్షగా చూసింది. అతను మధుయే. సందేహం లేదు. ఇప్పుడు ఆమె మనసు కొంచెం కుదటబడింది. మరొకసారి బయటకు చూసి, కిటికీలు మూసింది. మధు, ఆ హోరు గాలితోపాటు వూగిపోతూ, ఆవాన దెబ్బలకు తట్టుకుంటూ, తనదగ్గరున్న వస్తువులను తడసిపోకుండా జాగ్రత్తగ పట్టుకొని, ఆయాసంతో రొప్పుతూ యింట్లోకి వచ్చాడు. చేతిలోవున్నమందుసీసా ప్రక్కనేవున్న టేబిలుపైయుంచి ఆయాసంగా బట్టలు విప్పి ప్రక్కనేయున్న త్రాడుపై వేసాడు. మధూ! డాక్టరుగారు ఏమన్నారు? వారు రాలేదేం? అని ఆతృతగా అడిగింది. మధు కొంచెం ఆయాసం తీర్చుకొని, డాక్టరుగారికి కొంచెం అర్జంటు కేసు వుందట. అంచేత రాలేదు. ఇదిగో...ఈ మందు పాపకి యిస్తుండండి. అని మందుసీసా యిచ్చాడు.

మధువెళ్ళిపోయాడు. ఆవిడ ఆ మందుతీసుకొని పాపకి పట్టింది. రెండురోజులలో ఆ మందువల్ల పాపకి కొంచెం తగ్గింది. ఇపుడు పాప గొంచెం కులాసాగయుంది. రెండుమూడురోజులు దొర్లిపోయాయి. మధు వస్తూ, పోతూ, పాపను చూస్తున్నాడు. ఆరోజు మధు వచ్చాడు: వచ్చి అత్తయ్యా! పాపకి కొంచెం కులాసాగా యుందా? అని అడిగాడు. ఆమెనవ్వి, నీదయవలన పాప కులాసాగా యుంది. నువ్వేకాని అంత వానలో వెళ్ళకపోతే పాప బ్రతికేదా! అన్నారు.

ఆ...నాదేముంది. అంతా, ఆ భగవంతుని దయ. అన్నాడు. ఇంతలో అయిదేళ్ళ కుర్రవాడు 'బావా' అంటూ వచ్చి కాళ్ళను చుట్టేసుకున్నాడు. వాడిని ఎత్తుకుని, జేబులోనుండి బిస్కట్ పాకెట్ తీసి యిచ్చాడు.

మామయ్యగారు వచ్చారా అత్తయ్యా! పాప పరిస్థితి గురించి వుత్తరం వ్రాయలేకపోయారా? అని అడిగాడు. లేదు మధూ! మీ మామయ్య రాలేదు. నిన్ననే యుత్తరం వ్రాసాను. రెండుమూడురోజులలో రాగలరు.

ఇక వస్తానత్తయ్యా! నాకు బజార్లో కొంచెం పనుంది. అన్నాడు.

అపుడే వెళ్ళిపోతావా మధూ! వుండు కాఫీ త్రాగి వెడుదువుగాని అంటూ లోపలికి వెళ్ళింది. మధు ప్రక్కనేయున్న సోఫాలో కూర్చున్నాడు. ఆమె అంటే మధుకి ఎంతో అభిమానం. కులం వేరయినా, మనసులు మాత్రం ఒకటే. ఏ రహస్యాన్నయినా ఆమెదగ్గర ఏదీ దాచకుండా చెప్పేవాడు. ఆమెను చనువుగా అత్తయ్యా! అని పిలుస్తాడు. ఎపుడూ తనపిల్లలతోపాటు కన్న కొడుకులా చూసేది. దేనికైనా యిబ్బంది వస్తే, ఆమెను మొహమాటం పడకుండా అడిగి, తీసుకొనేవాడు. దేనికైనా మొహమాటపడితే కసరుకొని ఇంకెపుడూ నాదగ్గర మొహమాటపడకు. నీకేదైనా అవసరమొస్తే అడుగు అని చెప్పేది. అలాగే తనకేమయినా కావలసివస్తే తీసుకొనేవాడు. ఆమెయొక్క ఆదరానికీ, అభిమానానికీ ఎంతో సంతోషించాడు. ఇంతలో కాఫీ తీసుకొని వచ్చిం.

ఆమె ఎంతో అప్యాయంగా తీసుకో మధూ! అని అందించింది, మధు! కాఫీ త్రాగి అత్తయ్యా! నేను ఉద్యోగానికి ప్రయత్నిస్తున్నాను! ఏమో దేవుని దయవల్ల ఉద్యోగ్యం ఏదైన వస్తే కష్టాలు గట్టెక్కినట్లవుతాయి. ఏదో ఒకటి చూసుకోవాలిగదా! ఇలా ఎంత కాలమని గడపాలి! అని అన్నాడు.

ఆమె అందుకొని - మీ మామయ్యగారితో చెప్పలేక పోయావా? ఏమయినా ఉద్యోగం ఖాళీగా యుంటే చూద్దారేమో! అనింది.

ఆ...ఎందుకులెండి. ఆయన దయయుంటే తప్పక చేయిస్తారు. ఆ...ఇక నేవస్తా నత్తయ్యా! పాపను కొంచెం జాగ్రత్తగా చూడండి అని వెళ్ళిపోయాడు.

మధు వెళ్ళినప్పుడల్లా తన సొంత కొడుకే వెళ్ళినట్లుగా ఫీలయ్యేది. ఆమె మధు వెళ్ళిన వైపే చూస్తుంది. ఆమె మనసులో ఎన్నో ఆలోచనలు సుళ్ళు తిరిగాయి. మధు! ఎంత మంచివాడు. ఏంతో శాంతం, అణకువతో చెప్పిన పనేదయినా సరి చేశేస్తాడు. ఎంతో సరళ స్వభావుడు. అతనికి నేనంటే ఎందుకో అంత అభిమానం. య్చే...పాపం...ఇలా ఆలోచిస్తూ అక్కడనుండి భారంగా అడుగులు వేస్తూ లోనికి పోయింది.

కాలచక్రంలో అణువుల్లా అయిదు రోజులు గడచిపోయాయి. ఆ రోజు మధు వాళ్ళింటికి వెళ్ళాడు. అత్తయ్య! మామయ్యగారు వచ్చారా! అని అడిగాడు.

ఆ విషయమే చెప్పాలనుకుంటాను. నిన్ననేవచ్చారు మధూ! ఇప్పుడే అలా వీధిలోకి వెళ్ళారు. ఇప్పుడే వస్తారు కూర్చో! అన్నాడు.

ఆ.....వచ్చారా అత్తయ్యా! అన్నాడు ఆశ్చర్యంతో.

ఇంతలో వెనుకనుంచి ఏం, మధూ, కులాసాగ యున్నావా? అని వినిపించింది.

మధు వెనుతిరిగి చూశాడు. విశ్వనాథంగారు అపుడే లోపలికి వస్తున్నారు—ఆఁ... క్షేమంగానే యున్నానండీ. ప్రస్తుతం మీరు కేంపు వేశారా అని అడిగాడు.

లేదు మధూ, ఏదో చూసిపోదామని ఈ ఆదివారం యిలా వచ్చాను. అయినా నువ్వుండగ మా యింట్లో భయమెందుకోయ్! అవునుగాని ప్రస్తుతం ఏం చేస్తున్నావు? అని అడిగారు.

అబ్బే...ఏంచెయ్యలేదండీ. ఏదో మీ దయవల్ల ఏదన్నా చిన్న వుద్యోగం వస్తుందేమోనని చిన్న ఆశ వుంది అన్నాడు. ఆ. నాదేముందిలేవోయ్! అయినా, ప్రయత్నిస్తాను. చూడు...ఈనెలలో సర్వేలైన్ వర్కర్సుకి ఆర్డర్లు వస్తాయి. దానితాలూకు నమూనా చేస్తాను. తప్పక అప్లికేషను పెట్టు అన్నారు......అలాగేనండి. మీరు చెప్పినట్లు తప్పక చేస్తాను.....విశ్వనాథంగారు గోడనున్న గడియారం చూసి నువ్వు, ఇవాళ మా యింట్లో తప్పక భోజనం చెయ్యాలి. లే...పద వెళదాం. అన్నారు. ఆ...నేనా...మీయింట్లోనా...భోజనం చెయ్యాలా! అబ్బే ఇపుడేం వద్దులెండి. అని అన్నాడు... అదేంటి మధూ! ఏం-భోంచేస్తే తప్పా! అని అన్నారు ప్రక్కనేయున్న పార్వతమ్మగారు......

అబ్బే-తప్పా అనికాదు...అయితే వెంటనే లే! అన్నారు. ఆవేళ అదే మొదటిసారి. వాళ్ళింట్లో భోజనం చెయ్యడం. ఆఖరున భోజనాలయిపోయినయ్. మధ్యాహ్నం గోడ గడియారం పన్నెండు కొట్టింది. విశ్వనాథంగారు తమలపాకులు వేసుకుంటూ ఒంటి

గంటకి వున్న బండికి, ప్రయాణానికి బెడ్డింగు సర్దుకుంటున్నారు.

మధు చూసి ఆశ్చర్యంగా ముఖంపెట్టి, అదేమిటండీ! అపుడే వెళ్లిపోతారా? అన్నాడు......

వెళ్ళాలి మధూ. శెలవులేదు. నాచీవంక చూసుకొని బెడ్డింగు కూలి వానికి యిచ్చారు. భార్యతో కొన్ని సంగతులు చెప్పి, మధువైపు తిరిగి. నాకు టైమయిందోయ్. నేను వెళ్తానోయ్‌మరి. అవును, మరచిపోయాను. యింటి వద్ద ఎవరూ లేరు. అపుడపుడొస్తూండు. అనిచెప్పి వెళ్ళిపోయారు. మధు ఆయన వెళ్ళిన దిక్కుని చూస్తూ, ఆయనెంత ఉదారుడు. నేను అంటే ఆయనకి ఎందుకో యింత అభిమానం. ఏమిటో ఈ అనురాగం. నన్నింత ఆదరంగా ఆదరించి, అభిమానించిన ఈదంపతులకు ఇదే నా కృతజ్ఞత' అని అప్రయత్నంగా చేతులు రెండూ జోడించాడు.

వెనకాలే పార్వతమ్మగారు వచ్చి; అదేమటి మధూ! అలా వీధిలోనికి దణ్ణం పెడతావ్! అని అడిగారు.

అబ్బే ఏమీలేదండి వూరికినే...ఏదో దారిచూపమని దేవుని ప్రార్థిస్తున్నాను. అని అన్నాడు నవ్వుతూ,

మధూ! నీవిషయం, నీపరిస్థితి, నువ్వు వుద్యోగంకోసం తిరగడం మొదలగు సంగతులు చెప్పాను. నీకు తప్పక వుద్యోగం చూస్తానన్నారు.

మధు ఆశ్చర్యంతో ఆ...మీరు కూడా ఆయనతో చెప్పారా? సంతోషంతో ఆమె చేతులు పట్టుకొని మీ మేలు యీ జన్మంలో మరచిపోను. నేను యిక్కడకు వచ్చినపుడల్లా ఎంతో ఆదరించి ప్రేమలా చూశారు. మీ అభిమానానికీ, ఆదరానికి ఎలా కృతజ్ఞత తెల్పాలో అర్థం కావటంలేదు అన్నాడు.

ఆ......అదేమిటి మధూ! ఈ మాత్రానికే కృతజ్ఞత తెల్పాలా! మంచివాడివే అన్నారు.

అలా అనకండి. ఇదివరకు నేను ఎంత చెడుగా తిరిగేవాడినో, కాని మీ పరిచయంవల్ల నేను పూర్తిగా మారిపోయాను. మీరు నన్ను అమితంగా ఆదరించి అభిమానించారు. అందువల్ల మీ సావాసంలో నేను చెడు అలవాట్లనుండి పూర్తిగా మారగలిగాను. మీరేకాని నన్నిట్లా చూడకపోతే నేను యిపుడు ఏ విధంగావుండే వాడినో కదా! అని అన్నాడు. రెండు కన్నులలోనూ అశ్రువులు నిండుకున్నయ్.

ఛా.....తప్పు మధూ! ఇంత బేలతనం నీకు పనికిరాదు. జరిగింది మరచిపో. అస్తమాను ఆ విషయాలు మనసులోకి తెచ్చుకోకు. హాయిగా వుండు. అంతేగాని జరిగిపోయింది తలుచుకుంటే ఏం లాభం! ఇక ఆ పాత విషయాలు కదపకు అని అంది.

అత్తయ్యా! మీ మనసు బాధపడితే నన్ను క్షమించండి. సాధ్యమైనంతలో యెదుటివాళ్ళ మనస్తత్వాన్ని గ్రహించాలని తాపత్రయం పడతాను. ఆయన నాకు ఏదైన దారి చూపిస్తే ఆయన ప్రయత్నంవల్ల ఏదయినా ఉద్యోగం వస్తే నా జీవితంలో వెలుగు మార్గాన్ని వెతుక్కుంటూ వెళ్ళగలనేమో! అన్నాడు. అదేమిటి మధూ! మా పిల్లలొకటి నువ్వొక్కటివా? మీ మామయ్యగారికి నువ్వంటే ఎంతో అభిమానం. నీ సంగతి ఆయన తరుచు చెప్పేవారు. ఆయన చాలా మంచివారు మధూ! అన్నారు.

మధు లేచి వస్తానత్తయ్యా! అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఒక నెల గడచిపోయింది. ఆరోజు మధు వాళ్ళింటికి వెళ్ళాడు. లోపల సోఫాలో కూర్చుని విశ్వనాథంగారు, పార్వతమ్మగారు ఏదో మాట్లాడుకుంటున్నారు. మధు రాకనే గమనించలేదు. మధు చిన్నగ దగ్గాడు. వారు మధుని చూచి రావోయ్, రా...మధు అని పిలిచారు. విశ్వనాథంగారు లోపలికి వెళ్ళారు. మధు ప్రక్కన్నే సోఫాలో కూర్చున్నాడు. చూడు మధూ! నీకు మీ మామయ్యగారు ఒక ఉద్యోగం చూశానని చెప్పారు. ఇవాళ పదకొండు తారీఖు కదూ! అ...రేపే నువ్వు జాయిన్ అవాలని అంటున్నారు. అని పార్వతమ్మగారు అన్నారు.

మధు ఆశ్చర్యంగా! నిజమేనా అత్తయ్యా? లేక హాస్యానికంటున్నారా? అని అడిగాడు.

నిజమే మధూ! హాస్యమెందుకవుతుంది. అంటూ లోపలికి వెళ్ళిన విశ్వనాథంగారు అన్నారు. వారి చేతిలో వున్న టైపు చేసిన రెండు కాగితములు మధుకి యిచ్చారు.

చూడు మధూ! రేపు నువ్వు 'ఈ వుద్యోగంలో జాయిన్' అని అన్నారు.

మధు ఆ కాగితాలు చూసాడు. ఆశ్చర్యం! అందులో రేపే ఆఫీసులో చేరాలని వుంది. ఆనందం పట్టలేక మామయ్యగారూ! మీ సహాయం నేనీజన్మలో మరువలేను. మీ ఋణం ఎన్ని జన్మాలెత్తినా తీరదు. అని రెండు కన్నీటి బింధువులు రాల్చాడు.

ఆ...ఛీ! 'మధూ! ఏముంది. ప్రయత్నించాను. ఫలితం దక్కింది. అంతా దేవుని దయ' అన్నారు.

మధు! కన్నులలో నిండివున్న కన్నీటి బింధువులను తుడుచుకొని వస్తాను మామయ్యగారూ! అని వెళ్ళిపోయాడు.........తీరా వుద్యోగంలో చేరిన తరువాత మమ్మల్ని మరచిపోగలవుసుమా! అని అన్నారు పార్వతమ్మ. మధు వెనుతిరిగి, అది నా జన్మలో జరగదు. అత్తయ్యా! అంటూ ఆ దంపతులయొక్క అభిమానానికి మనసులోనే కృతజ్ఞత తెల్పుతూ వెళ్ళిపోయాడు. ఆ దంపతులు అతను వెళ్ళినవైపే చూస్తూ! ప్చ్...పాపం ...అని నిట్టూర్చి లోనికి వెళ్ళిపోయారు.

---

విరిగిన కిటికీ

(18 వ పేజీ తరువాయి)

'అయితే నువ్వే ఆ బంతి కొట్టేనంటావు?'

నేను విరిగిన అద్దాల కిటికీ సంగతి మరచేపోయేను. నేను అవునట్లు చిరునవ్వు నవ్వేను.

'అవును నేనే'

తల నెరసిన మనిషికూడా చిరునవ్వు నవ్వేడు.

'అది చిన్న కిటికీ.'

'కిటికీ-అంటారా?' అన్నాను నవ్వుతూ-

'నేను దానిని బాగుచేసేస్తాను' అన్నాను మళ్ళీ.

బంతి పులిచేతినుండి విడుదలై మా కాళ్ళదగ్గర పడివుంది. వృద్ధుడు మెల్లగా కళ్ళజోడుతీసి, ఆలోచిస్తున్నాడు-విచారంగా మొహం పెట్టి, 'ఒక అద్దంకాదు. దాని అద్దాలన్నీ పగిలిపోయాయి' అన్నాడు.

'అదెప్పుడు?' అని అడిగాను.

'విమానదాడి జరిగినప్పుడు - బాంబుపడి'...అంటూ ఆయన పూలచెట్లవేపు చూపుతూ బాంబు పడినచోటు చూపించాడు. (సశేషం)

చిత్రసమీక్ష

## 'వరలక్ష్మివ్రతం'

విఠల్ ప్రొడక్షన్స్‌వారి 'వరలక్ష్మివ్రతం' చిత్రం 20-8-61 వ తేదిన గోల్డన్ స్టుడియోలో పత్రికా ప్రతినిధులకుగాను ప్రత్యేకముగా ప్రదర్శించారు.

కలియుగంలో సులభముగా దైవానుగ్రహం కలిగే మార్గం చూపమని నారదుడూ, సప్తఋషులూ పార్వతీ పరమేశ్వరులను ప్రార్థించగా అందుకు వరలక్ష్మివ్రతం ఒక్కటే సాధనమని ఆ ఆదిదంపతులు ఆదేశిస్తారు. ఆ వ్రతంచేసి తనవారికి కలిగిన ఆపదలను తొలగించిన పుణ్యవతి మణిమంజరి చరిత్రే యీ చిత్రానికి యితివృత్తం.

కథ అతి చిన్నకథ: ఆ కథను మంత్ర-తంత్ర, కత్తియుద్ధాలు-పాటలు-నృత్యాల ఆధారంతో దాదాపు పద్దెదువేల అడుగులవరకూ ప్రేక్షకులకు విసుగుచెందని రీతిగా పెంచారు నిర్మాతలు.

మంత్రవాదిగా - రాజనాల, ఉదయసింహునిగా - కాంతారావు, మణిమంజరిగా-కృష్ణకుమారి, చక్కగా నటించారు. అవతారంగా నటించిన బాలకృష్ణ హాస్యం సమయోచితముగా ఉంది.

శ్రీ టి. జి. కృష్ణమూర్తిగారి పాటలు - మాటలు ముద్దులుగొలిపిస్తున్నది. రాజన్-నాగేంద్రగారి సంగీతమూ వినసొంపుగా ఉన్నది. శ్రీ జి. చంద్రు ఫోటోగ్రఫీ అత్యద్భుతంగా ఉంది.

బాలురు మొదలు-వృద్ధులవరకూ చూచి ఆనందించే విధంగా ఈ చిత్రాన్ని దర్శకుడూ, నిర్మాతయైన శ్రీ బి. విఠలాచారిగారు చిత్రీకరించారనడానికి సందేహం లేదు.

కథాంజలి
(స్థాపితం 1938)

విడిప్రతి రూ. 0-25

సంవత్సర చందా 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్‌స్టాల్సులోనూ దొరకును.

Edited and Published by A, N, Raghavachar, No, 32, Krishnappa Naick TankSt,, Madras-1
Printed by V, Kuppuswamy Chetty, Bharathmata Press, No, 39, Anderson St,, Madras-I